ఐ లవ్ బొర్రా

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహలు ప్రాంతంలో ఐ లవ్ బొర్రా పేరుతో ఐటీడీఏ ఆధ్వర్యంలో బోర్డు ఏర్పాటు చేశారు. బొర్రా గుహల సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఈ బోర్డు వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సంబరపడుతున్నారు.





మిర్చి సాగు ప్రశ్నార్థకం

గోదావరి వరద మిర్చి రైతులను వెంటాడుతూనే ఉంది. ఈ ఏడాది ఇప్పటికే నాలుగు సార్లు వచ్చిన వరదలు మిర్చి సాగును ప్రశ్నార్థకంగా మారింది. 8లో

న్యూస్‌రీల్

అన్ని గ్రామాల్లో స్పోర్ట్స్ క్లబ్‌లు

- కలెక్టర్ సుమిత్ కుమార్
- జగనన్న స్పోర్ట్స్‌క్లబ్ యాప్ ఆవిష్కరణ



జగనన్న స్పోర్ట్స్ క్లబ్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసి క్రీడల అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. తన కార్యాలయంలో జగనన్న స్పోర్ట్స్‌క్లబ్ యాప్‌ను సోమవారం రాత్రి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. క్రీడాకారుల సంక్షిప్త సమాచారాన్ని యాప్‌లో పొందుపరిస్తే వారి ప్రతిభ, నైపుణ్యం ఆధారంగా ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించడానికి దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని క్రీడాకారులంతా స్పోర్ట్స్ క్లబ్ యాప్‌ను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ జె.శివ శ్రీనివాస్, జిల్లా క్రీడా అధికారి ఎ.జగన్మోహన రావు, కోచ్‌లు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



కేజీబీవీలో రికార్డులు తనిఖీ చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: గిరిజన విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆదేశించారు. మంగళవారం లగిశపల్లి రోడ్డులోని కేజీబీవీ పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ పాఠశాలలో నాణ్యమైన మెనూ అమలు చేయాలని, పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో వారి సమస్యలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఇంటర్మీడియెట్ విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి, సీఆర్టీ ఉపాధ్యాయుల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థినుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మౌలిక సదుపాయాల కల్పనకు కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. ఎలాంటి ఆందోళన చెందకుండా చక్కగా చదువుకోవాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లగిశపల్లి సర్పంచ్ లకే పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యుడు లకే రామకృష్ణ పాత్రుడు, ఎంఈవో సరస్వతి దేవి, కేజీబీవీ ఎస్‌వో చంద్రకళ పాల్గొన్నారు.

త్వరలోనే విశాఖ నుంచి పాలన

టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి

సింహాచలం: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలనే మూడు రాజధానులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని, అది కచ్చితంగా జరుగుతుందని ఉమ్మడి విశాఖ వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. పెందుర్తి మండలం రాంపురంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. న్యాయపరమైన చిక్కులన్నీ తొలగించుకుని త్వరలోనే విశాఖపట్నం నుంచి పాలన చేపడతామన్నారు. అమరావతి రైతులు పాదయాత్ర అంటూ ఉత్తరాంధ్రపై దండయాత్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ పాదయాత్ర వెనుక ఎవరున్నారో ప్రజలు తెలుసుకోవాలన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల స్వార్థ ప్రయోజనాల కోసమే రాజధానిగా చంద్రబాబు అమరావతిని ఎంపిక చేశారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు నిశితంగా పరిశీలిస్తున్నారని.. వారిని కచ్చితంగా తిప్పి కొడతారన్నారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కరణం ధర్మశ్రీ, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, రాంపురం సర్పంచ్ శిరీష పాల్గొన్నారు.

మళ్లీ వరద గుప్పెట్లోకి..

నాల్గోసారి గోదా'వర్రీ' • గ్రామాల్లోకి ప్రవేశిస్తున్న వరదనీరు



కూనవరం: వరద నీటిలో మునిగిన ఉదయ్‌భాస్కర్ కాలనీ



వీఆర్ పురం : వరద నీటిలో సామగ్రితో పునరావాస కేంద్రాలకు తరలివెళుతున్న వడ్డిగూడెం గ్రామస్తులు

చింతూరు: విలీన మండలాలు మళ్లీ వదర గుప్పెట్లోకి వెళ్లాయి. దీంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాలకు తరలివెళుతున్నారు. భారీ వర్షాలతో ఈ ఏడాది జూలై నుంచి ఇప్పటివరకు నాలుగు సార్లు గోదావరి, శబరి నదులకు వరద వచ్చింది. తాజాగా మంగళవారం భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 51.6 అడుగులకు చేరుకుంది. కేంద్ర జలవనరుల శాఖ అధికారుల అంచనా ప్రకారం నీటిమట్టం తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయి. ఎటపాక మండలంలో పలుచోట్ల రహదారుల పైకి వరదనీరు చేరడంతో భద్రాచలం, కూనవరం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరం మండలాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో కూనవరం నుంచి చింతూరుకు రాకపోకలు నిలిచిపోయాయి. వీఆర్‌పురం మండలం వడ్డిగూడెంలో ఇళ్లలోకి వరదనీరు చేరడంతో అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాలుగు మండలాల్లో వరద పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చింతూరు ఐటీడీఏ పీవో రామశేషు తెలిపారు. గ్రామాల్లోకి వరదనీరు ప్రవేశిస్తే వెంటనే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ముంపు గ్రామాల్లోనే ఉంటూ పర్యవేక్షించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించినట్టు ఆయన తెలిపారు. అవసరమైతే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించినట్టు పీవో తెలిపారు.

పెరుగుతున్న శబరి నీటిమట్టం

గోదావరి ఎగపోటు కారణంగా శబరినది నీటిమట్టం పెరుగుతోంది. దీంతో చింతూరు మండలంలో పలువాగులు పొంగి వరదనీరు రహదారుల పైకి చేరింది. చంద్రవంకవాగు పొంగి వరదనీరు జాతీయ రహదారి పైకి చేరడంతో మన రాష్ట్రం నుంచి తెలంగాణాకు రాకపోకలు నిలిచిపోయాయి. కుయిగూరువాగు మరింత పెరగడంతో మంగళవారం కూడా ఆంధ్రా, ఒడిశా నడుమ రాకపోకలు స్తంభించాయి. చంద్రవంక, సోకిలేరు, జల్లివారిగూడెం, కుయిగూరు, చీకటివాగులు పొంగి వరదనీరు రహదారి పైనుంచి ప్రవహిస్తుండడంతో చింతూరు నుంచి వీఆర్‌పురం, కూనవరం మండలాలతో పాటు చింతూరు మండలంలోని 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు వాగులు పొంగడంతో నదీ పరీవాహక ప్రాంతాల్లో ప్రస్తుతం వేసిన వరి నారు నీట మునిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



చింతూరు మండలం చట్టి, కుమ్మూరు నడుమ రహదారిపై ప్రవహిస్తున్న చంద్రవంక వాగు

ముంపు భయంతో ఇళ్లు ఖాళీ

వీఆర్‌పురం: మండలంలోని నదీ పరీవాహక గ్రామాల ప్రజలు ముంపు భయంతో ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాల బాటపట్టారు. జులైలో 12వ తేదీన తొలిసారి వరద నీరుభారీగా చేరడంతో మండలంలోని సుమారు 40 గ్రామాలకు పైగా ముంపునకు గురయ్యాయి. రెండు వారాలకు పైగా నీరు గ్రామాల్లో ఉండిపోవడంతో తాటాకు ఇళ్లు నానిపోయి కూలిపోయాయి. తిరిగి ఆగస్టు 10 నుంచి 20 తేదీల మధ్యలో రెండు సార్లు గోదావరి ఉప్పొంగడంతో పలు గ్రామాలు ముంపు బారిన పడ్డాయి. కాగా వినాయక చవితి అనంతరం గోదావరి ప్రభావం తగ్గిపోతుందని భావించిన వరద బాధితులు వారం రోజుల క్రితం పునరావాస కేంద్రాలను నుంచి ఇళ్లకు సామగ్రితో తిరిగి చేరుకొంటున్నారు. మళ్లీ వరద వస్తుండడంతో చేసేదేమీ లేక పునరావాస కేంద్రాలకు వెళ్లాలి వస్తోందని బాధితులు వాపోతున్నారు. వడ్డిగూడెం -వడ్డిగూడెం కాలనీ, కన్నాయిగూడెం- చింతరేవుపల్లి, ఏవీగుడెం-తుష్టివారిగూడెం, సీతంపేట-శ్రీరామగిరి, పోచవరం-ఇప్పూరు గ్రామాల మధ్య రహదారుల పైకి వరద నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్ మండలంలో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదిస్తున్నారు. వడ్డిగుడెం ,వడ్డిగుడెం కాలనీలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టినట్టు అధికారులు చెప్పారు.

దంచికొట్టిన వర్షం

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, గెడ్డలు



పాడేరు మండలం బొక్కెళ్లు సమీపంలోని కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా ఐదు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం రాత్రంతా పలు ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. మంగళవారం మధ్యాహ్నం తర్వాత వర్షం తగ్గుముఖం పట్టింది. గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో విలీన మండలాల్లోని వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. ఆయా మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అప్రమత్తం చేశారు. లోతట్టు గ్రామాల్లోని ప్రజలను ముందస్తుగానే సురక్షితప్రాంతాలకు తరలిస్తుండడంతో పాటు నిత్యావసరాల పంపిణీకి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు.

పాడేరు, రంపచోడవరం డివిజన్ల పరిధిలోని పలు గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జి.మాడుగుల మండలం నుంచి పాడేరు, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల వరకు విస్తరించి ఉన్న ప్రధాన మత్స్యగెడ్డలో వరద ప్రవాహం అధికంగా ఉంది. బొక్కెళ్లు, పరదాని పుట్టు సమీపంలోని కాజ్‌వేల మీదుగా నీరు ప్రవహిస్తోంది. కాజ్‌వేల అవతల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పెదబయలు, ముంచంగిపుట్టు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో, పర్యాటక ప్రాంతాలైన చాపరాయి, మత్స్యగుండం, కొత్తపల్లి ప్రాంతాల్లోని గెడ్డలు ప్రమాదకరంగా మారాయి.

వర్షపాతం వివరాలు

జిల్లాలోని ఎటపాకలో ఒక మిల్లీమీటరు, కూనవరంలో 7, చింతూరులో 40, వీఆర్‌పురంలో 4, ముంచంగిపుట్టులో 12, పెదబయలులో 4, డుంబ్రిగుడలో 5, అరకులోయలో 3, అనంతగిరిలో 7, హుకుంపేటలో 11, పాడేరులో 28, జి.మాడుగులో 47, చింతపల్లిలో 35, జి.కె.వీధిలో 17, కొయ్యూరులో 14, మారేడుమిల్లిలో 17,వై.రామవరంలో 27, అడ్డతీగలలో 11, రాజవొమ్మంగిలో 6,గంగవరంలో 5, రంపచోడవరంలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యం

- సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్నకలెక్టర్ సుమిత్ కుమార్, పక్కన ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: గిరిజన గ్రామాల్లో నిరంతర విద్యుత్ సరఫరాయే లక్ష్యంగా విద్యుత్ శాఖ అధికారులు పనిచేయాలని కలెక్టర్ సుమిత్ ఆదేశించారు. విద్యుత్ సమస్యలపై పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మితో కలిసి కలెక్టర్ మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. జి.కె.వీధి మండలంలోని గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి, సప్పర్ల ప్రాంతంలో అదనపు సిబ్బందిని, పూర్తిస్థాయిలో సామగ్రిని ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఏపీ ట్రాన్స్‌కోకు మంజూరైన పోస్టులు, ఎంత మంది ప్రస్తుతం విధుల్లో ఉన్నారు, అదనంగా ఎన్ని పోస్టులు అవసరం తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. సప్పర్ల ప్రాంతంలో నలుగురు సిబ్బందిని నియమిస్తే సమస్యలను అధిగమించవచ్చని ట్రాన్స్‌కో అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. విద్యుత్ లేని గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి, అదనపు సిబ్బంది నియమించడానికి తగిన చర్యలు వెంటనే తీసుకోవాలని,ఈ మేరకు ట్రాన్స్‌కో సీఎండీతో చర్చిస్తామని కలెక్టర్ తెలిపారు.

అంతరాయం లేకుండా చూడాలి : ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

మారుమూల గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు. జి.కె. వీధి మండలంలోని గుమ్మిరేవుల, దారకొండ, దుప్పులవాడ పంచాయతీల పరిధిలో వర్షాలు కురిసినప్పుడల్లా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. జి.కె.వీధి మండలంలోని బోయవీధి, దేగలపాలెం గ్రామాలకు విద్యుత్ గ్రిడ్ సదుపాయం కల్పించాలని, పాడేరు మండలంలోని కించూరు, వంటివీధులు, గొడ్లపాడు, గడ్డిబంద గ్రామాల్లో అదనంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఏపీ ట్రాన్స్‌కో పాడేరు ఈఈ మల్లికార్జున రావు, చింతపల్లి, జి.కె. వీధి ప్రాంతాలకు చెంది జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులు, పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

హిట్‌లిస్టులో పనులు చేయని కాంట్రాక్టర్లు

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ



అరకులోయ: బిల్లులు తీసుకుని కూడా పనులు చేయని కాంట్రాక్టర్లను హిట్ లిస్టులో పెట్టి భవిష్యత్‌లో ఎటువంటి కాంట్రాక్ట్ పనులు పొందకుండా చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మండలాల పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారులు, గ్రామ సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీల పనుల పురోగతిపై మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో రూ.106 కోట్లతో భవన నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. రూ.102 కోట్ల మేర బిల్లులు చెల్లించామని, మిగిలిన రూ.4కోట్లకు ఎఫ్‌టీవోలు జనరేట్ చేశారని, వారంలోగా చెల్లిస్తామని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు వేగంగా పూర్తి చేయడానికి ఎంపీడీవోలు చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): పలు ప్రాంతాల్లో జరుగుతున్న పనుల నేపథ్యంలో రైళ్లు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఈ కారణంగా అటునుంచి రావలసిన రైళ్లు విశాఖకు ఆల్యసంగా చేరడంతో ఇక్కడ నుంచి బయల్దేరాల్సిన రైళ్లను రీషెడ్యూల్ చేసినట్టు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖలో మంగళవారం సాయంత్రం 5.35 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం-మహబూబ్ నగర్(08585)స్పెషల్ రాత్రి 8.10గంటలకు బయల్దేరింది. విశాఖలో మంగళవారం రాత్రి 11.20 గంటలకు బయల్దేరాల్సిన విశాఖపట్నం - లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారు(మధ్యరాత్రి)1.20 గంటలకు బయల్దేరింది.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్‌లో ఏడు మండలాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు డీఎంవో, ఏఎంవో, సబ్ యూనిట్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిచారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించి, మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. గర్భిణులను ప్రసవ సమయానికి 15 రోజులు ముందుగానే ఆస్పత్రిల్లో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఏడాది ప్రధాన మంత్రి సురక్షయోజన ద్వారా ఎంతమంది గర్భిణులు లబ్ధిపొందారో తెలుసుకున్నారు. ఎంత మందికి కరోనా వ్యాక్సిన్ వేశారు, ఇంకా ఎన్ని డోసులు అందుబాటులో ఉన్నాయో ఆరా తీశారు. ప్రతీ నెలా పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాలని ఆదేశించారు.


నా ఇష్టప్రకారమే మావోయిస్టు పార్టీలో చేరాను

మావోయిస్టు సభ్యురాలు రాధిక పేరుతో లేఖ

జి.మాడుగుల: తన ఇష్టప్రకారమే మావోయిస్టు పార్టీలో చేరానని, తనను ఎవరూ ప్రలోభ పెట్టలేదని సీపీఐ(మావోయిస్టు) సభ్యురాలు పల్లెపాటి రాధిక ప్రకటించారు. ఈ మేరకు ఆమె పేరుతో మంగళవారం ఒక లేఖ విడుదల చేశారు. 'నర్సింగ్ విద్యార్థిని రాధిక మిస్సింగ్ కేసు విచారణ పేరుతో ఎన్ఐఏ... ఉభయ తెలుగు రాష్ట్రాలలోని చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) నాయకురాళ్ల ఇళ్లలో సోదాలు చేయడాన్ని, తప్పుడు కేసులు బనాయించి అక్రమ అరెస్టులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. నేను అసలు నర్సింగ్ విద్యార్థినే కాదు. డీఎంఎల్‌టీ విద్యార్థినిని. మహిళలపై వివక్ష, అణిచివేత లాంటి వాటికి వ్యతిరేకంగా పనిచేయాలని విద్యార్థి దశలోనే నిర్ణయించుకున్నాను. చైతన్య మహిళా సంఘం సభ్యురాలిగా చేరి కొంత కాలం పనిచేశాను. సోషలిస్టు సమాజాన్ని స్థాపించడం ద్వారా మహిళా విముక్తి సాధ్యపడుతుందని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం సిద్ధాంతం ద్వారా అర్థం చేసుకున్నాను. సీఎంఎస్ సభ్యత్వానికి రాజీనామా ప్రకటించి సీపీఐ (మావోయిస్టు) పార్టీలో చేరాను. ఆ సమయానికి నా వయస్సు 20 ఏళ్లు. నన్ను ఎవరో ప్రలోభపెట్టి మావోయిస్టు పార్టీలో చేర్చారనేది కుట్ర మాత్రమే. పెదబయలు పోలీస్ స్టేషన్‌లో రాధిక మిస్సింగ్ అని నా తల్లిదండ్రులతో కేసు పెట్టించారు. ఇందుకోసం పోలీసులు ఒత్తిడి చేసి ఉంటారని నేను భావిస్తున్నాను...' అని ఆ లేఖలో రాధిక పేర్కొన్నారు.

రిజర్వాయర్లకు జలకళ

- భారీ వర్షాలతో చేరుతున్న వరద నీరు
- విద్యుత్ ఉత్పత్తికి తీరుతున్న నీటి సమస్య



బలిమెల జలాశయం



సీలేరులోని గుంటవాడ జలాశయం



జోలాపుట్టు జలాశయంలో పెరిగిన నీరు

సీలేరు/ముంచంగిపుట్టు: ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాల జలవిద్యుత్ కేంద్రాలకు నీరందించే రిజర్వాయర్లు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. బలిమెల, సీలేరు (గుంటవాడ), డొంకరాయి జలాశయాలతో పాటు ఆంధ్ర, ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ,జోలాపుట్టు జలాశయాల్లో నీటి మట్టాలు పెరిగాయి. విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయాల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డుడుమ జలశయం నీటి మట్టం 2,590 అడుగులు కాగా సోమవారం నాటికి 2,582.60 అడుగులకు చేరింది. డుడుమ జలాశయం ఎగువన ఉన్న జోలాపుట్టు జలశయ నీటి మట్టం సైతం క్రమేపీ పెరుగుతోంది. జోలాపుట్టు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా, మంగళవారం నాటికి 2729.60 అడుగులకు చేరింది. గత ఏడాది ఇదే రోజున 2,732 అడుగుల నీరు నిల్వ ఉంది. విద్యుత్ ఉత్పత్తి ప్రధానంగా జోలాపుట్టు జలాశయ నీటి నిల్వపైనే ఆధారపడి ఉంటుంది. ఈ ఏడాది నీటి నిలువ స్థాయి గత నెల వరకు తక్కువగా ఉంది. కేవలం 10 రోజుల వ్యవధిలో జోలాపుట్టు,డుడుమ జలాశయాల్లో ఊహించని విధంగా పెరిగింది. దీంతో మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తికి నీటి సమస్య తీరినట్టయింది.

- బలిమెల జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,516 అడుగులు కాగా మంగళవారం నాటికి 1,474 అడుగుల నీరు ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వరదనీటితో పాటు మాచ్‌ఖండ్‌లో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదల అవుతున్న నీరు బలిమెలలో చేరుతుంది. రోజువారీగా ఇన్‌ఫ్లో 9,782 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 2,144 క్యూసెక్కులు
- సీలేరు విద్యుత్‌కేంద్రం పరిధిలోని గుంటవాడ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1,360 అడుగులు కాగా, ప్రస్తుతం 1,343.8 అడుగులకు చేరింది. ఈ జలాశయంలో రోజువారీగా ఇన్‌ఫ్లో 2,374 క్యూసెక్కులు కాగా, అవుట్‌ఫ్లో 1,588 క్యూసెక్కులు
- సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం విడుదలైన నీరు 30 కిలోమీటర్లు ప్రవహించి డొంకరాయి జలాశయంలోకి చేరుతుంది. ఆ నీటితో పాటు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఉపనదుల నుంచి వస్తున్న నీరు చేరుతోంది. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1,037 అడుగులు కాగా, ప్రస్తుతం 1,017.90 అడుగుల నీరు ఉంది. ఈ జలాశయానికి ఇన్‌ఫ్లో 4,619 క్యూసెక్కులు వస్తుండగా, అవుట్‌ఫ్లో 2721.0 క్యూసెక్కులు.

నీటి మట్టాలు పెరుగుతున్నాయి



ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని అన్ని జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. బలిమెల, సీలేరు, డొంకరాయి జలాశయాల్లోకి వరద నీరు చేరుతోంది. ఆ నీటి నిల్వలకు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది.

-ప్రశాంత్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్, సీలేరు

పసుపు సాగుకు ప్రోత్సాహం



యంత్రాలు పంపిణీ చేస్తున్న అధికారులు

చింతపల్లి: పసుపు సాగును ప్రోత్సహిస్తున్నట్టు హార్టికల్చర్ అధికారి అశోక్ తెలిపారు. స్థానిక ఉద్యానవన పరిశోధన స్థానంలో సోమవారం చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని 10 పంచాయతీలకు పసుపు ఉడకబెట్టే, మెరుగు పరిచే యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన రైతులు పసుపు యంత్రాలు సద్వినియోగం చేసుకుంటే నాణ్యమైన ఉత్పత్తి తయారు చేయవచ్చని చెప్పారు. 2020-2021లో రెండు మండలాల్లో పసుపు సాగును ప్రోత్సహించినట్టు తెలిపారు. అధికంగా సాగు చేస్తున్న గ్రామాలను గుర్తించి యంత్రాలు పంపిణీ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో బాలకర్ణ, వీహెచ్‌వో వంపూరి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి కోరారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళా ప్రచార కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 11 సంస్థల్లో 770 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందని చెప్పారు. ఆసక్తి కలిగిన అర్హులైన యువతీయువకులంతా ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ప్రతినిధులు పిట్టా నవీన్, గంగాజి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 16న నిర్వహించనున్న మెగా జాబ్‌


జాబ్‌మేళా ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి

మేళాను నిరుద్యోగ గిరిజన యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.రోహిణి మంగళవారం ప్రకటనలో కోరారు. వివిధ సంస్థల్లో ఖాళీగా ఉన్న 770 పోస్టులను జాబ్ మేళాను ద్వారా భర్తీ చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాలో సుమార్ 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. పదవ తరగతి నుంచి డిగ్రీ, ఆపై పాసైన 18 నుంచి 30 సంవత్సరాల లోపు వయస్సు గల అభ్యర్థులు అర్హులన్నారు.

మిర్చి సాగు ప్రశ్నార్థకం

- వరద నీటిలో డ్రిప్ పరికరాలు
- ఆందోళనలో రైతులు

ఎటపాక: గోదావరి వరద మిర్చి రైతులను వెంటాడుతూనే ఉంది. ఈ ఏడాది ఇప్పటికే నాలుగు సార్లు వరదలు వచ్చి అన్నదాతలను ఆవేదనకు గురిచేస్తోంది. ఎటపాక మండలంలోనే అత్యధికంగా 2వేల హెక్టార్లలో మిర్చి సాగుచేస్తారు. జులై, ఆగస్టు వరదలు వరి, పత్తి పంటలపై ప్రభావం చూపితే ఇప్పుడు వచ్చిన వరదలు మిర్చి రైతులపై ప్రతాపం చూపుతుంది. మిర్చి మొక్కలు పొలాల్లో నాటుకునేందుకు సిద్ధమైన తరుణంలో గోదావరికి మళ్లీ వరదలు రావడంతో ఏమి చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు. అయితే మల్చింగ్ పద్ధతిలో సాగు చేసే రైతులు ఇప్పటికే పొలాల్లో డ్రిప్ పరికరాలు అమర్చుకున్నారు. నెల్లిపాక, తోటపల్లి ప్రాంతాల్లో కొందరు రైతులు సుమారు 60ఎకరాల్లో మిర్చి మొక్కలు కూడా నాటుకున్నారు. మొక్కలు ఇప్పుడు


నెల్లిపాకలో నీట మునిగిన మిర్చి పంట

వరద నీటిలో మునిగిపోయాయి. సుమారు 40 రోజుల పాటు ఎంతో జాగ్రత్తగా పెంచుకున్న మిర్చి నారును పొలాల్లో సకాలంలో నాటుకుంటేనే మంచి దిగుబడులు వచ్చేది. కానీ మంచి అదునుగా ఉందనుకునే తరుణంలో గోదావరి వరదలు ముంచెత్తాయి. వరదలు తగ్గినా ఆయా పొలాలు ఎండాలంటే పది రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. దీంతో సాగు మరింత ఆలస్యమై మిర్చి నారు ఏపుగా


గొరిదేవిపేట వద్ద వరద నీటిలో తేలియాడుతున్న డ్రిప్ పైపులు

పెరిగిపోతే కొంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. నందిగామ, గొరిదేవిపేట, మురుమూరు ప్రాంతాల్లో వ్యవసాయ పరికరాలు నీటమునగడంతో మల్చింగ్ విధానంలో సాగు చేసే రైతులకు నష్టం వాటిల్లినట్టే. వేల రూపాయలు ఖర్చు చేసి సాగుచేసే మిర్చి రైతులకు ఆదిలోనే ఆటంకాలు ఎదురవుతున్నాయి. వరుణుడు కరుణిస్తేనే సాగు పనులు చేయగలమని రైతులు చెబుతున్నారు.

రేపటి నుంచి తేనెటీగల పెంపకంపై ఉచిత శిక్షణ

గూడెంకొత్తవీధి: తేనెటీగల పెంపకంపై గిరిజన యువత, రైతులకు మూడు రోజులు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బీసీటీ కృషి విజ్ఞానకేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మూడు రోజుల పాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా ప్రత్యేకంగా గిరిజన యువత, రైతులకు అదనపు ఉపాధి, ఆదాయం పొందేలా తేనెటీగల పెంపకం, సేకరణ పద్ధతులు, మార్కెటింగ్ వివిధ కాలాల్లో తేనెటీగల యాజమాన్యం తదితర అంశాలపై శిక్షణ అందిస్తున్నట్టు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లి మండలం హరిపురం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల యువత, రైతులు శిక్షణకు హాజరై సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9440567379 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

లంపి వ్యాధిపై అప్రమత్తం

జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి

ముంచంగిపుట్టు: పశువులకు సోకే లంపి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి.వెంకటస్వామి అన్నారు. మండలంలోని బంగారుమెట్ట, దార్రెల, కించాయిపుట్టు పంచాయతీల్లో కించోల్దా, డొక్రిపుట్టు, చిన్నసింధిపుట్టు, మినుములపుట్టు, సరియాపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా 109 పశువులకు లంపి వ్యాధి నివారణ టీకాలు, 187 గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. పశువులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ రైతులు పశువ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పశువులు, మేకల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వైద్య సిబ్బంది సూచనలు పాటించాలని, ఎటువంటి సందేహాలున్నా సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో పశువులు


కించోల్దా గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటస్వామి

వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గిరిజన రైతులకు మందులు పంపిణీ చేశారు. పెదబయలు పశు సంవర్ధకశాఖ ఏడీ రాజారవికుమార్, కిలగాడ పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి, సిబ్బంది రాజుబాబు, రఘునాథ్, రామనాయుడు, రఘురామ్ తదితరులున్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

వీఆర్ పురం: వరద ముంపుకు గురైన మొద్దులగూడెం, సీతంపేట గ్రామాల్లోని వరద బాధిత కుటుంబాలకు ఏఎస్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్.శ్రీధర్ నిత్యావసర సరకులను మంగళవారం అందజేశారు. సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు మాట్లాడుతూ ఇటీవల సంభవించిన వరదలకు విలీన మండలాల్లోని అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, బాధితులను ఆదుకునేందుకు సంస్థ ద్వారా తమ వంతు సాయమందిస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లోని వరద బాధితులతో పాటు కూనవరం జిల్లా పరిషత్ హైస్కూల్ పారిశుధ్య సిబ్బందితో కలిసి 690 మందికి నిత్యావసర సరకుల కిట్లు అందజేశామని, ఒక్కో కిట్ విలువ వెయ్యి రూపాయలు ఉంటుందన్నారు. ఎస్ఐ తెలం దుర్గాప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్, బాలు, వెంగళరావు,కాంతారావు, ఏఎస్‌డీఎస్ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వరద బాధితులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న ఏఎస్‌డీఎస్ సంస్థ ప్రతినిధులు

పర్యాటక ప్రాంతంగా అరకు మరింత అభివృద్ధి

ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ

అరకులోయ: అరకులోయ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తున్నామని ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ తెలిపారు. మండల కేంద్రంలోని గిరిజన మ్యూజియాన్ని ఆయన మంగళవారం సందర్శించి, అందుబాటులోని సౌకర్యాలను పరిశీలించారు. అలాగే గిరిజన మ్యూజియం ఎదురుగా పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాటు చేసిన 'ఐ లవ్ అరకు' గ్లోసైన్ బోర్డును పీవో పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మ్యూజియం ఆవరణలో పార్కింగ్ స్థలం ప్రాంగణాన్ని పీవో గోపాలకృష్ణ ప్రారంభించారు. ఇటీవల ప్రారంభించిన ఐటీడీఏ దుకాణ సముదాయంలో వ్యాపారులు ఏర్పాటు చేసుకున్న దుకాణాలను పరిశీలించి ఆయా వ్యాపారులతో ఆయన మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. గిరిజన మ్యూజియం మేనేజర్ మురళి, పలు శాఖల అధికారులున్నారు.



గిరిజన మ్యూజియం వద్ద ఏర్పాటుచేసిన ఐ లవ్ అరకు బోర్డు వద్ద ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పుట్టగొడుగులు తిని గిరిజనులకు అస్వస్థత

ముంచంగిపుట్టు: మండలంలో గల బాబుశాల పంచాయతీ మత్స్యపురం గ్రామంలో ఇద్దరు గిరిజనులు పుట్టగొడుగులు తిని తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గ్రామ సమీపంలో కొండ ప్రాంతంలో సేకరించిన పుట్టగొడుగులను మంగళవారం మత్స్యపురం గ్రామానికి చెందిన టి.సీతన్న, టి.చంప అనే భార్యభర్తలు కూర వండి తిన్నారు. తిన్న వెంటనే ఇద్దరికీ వాంతులు, విరోచనాలు అధికం అయ్యాయి. దీంతో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ముంచంగిపుట్టు సీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తరలించారు. స్థానిక వైద్య సిబ్బంది వసంత, వంశీలు బాధితులకు వైద్య సేవలు అందించారు. కొంత సమయం తర్వాత వారి ఇద్దరి పరిస్థితి మెరుగు పడడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. వారిని అబ్జర్వేషన్ నిమిత్తం సీహెచ్‌సీలోనే వైద్య సిబ్బంది ఉంచారు. గిరిజనులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వర్తక సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్, నేతలు శాస్త్రిబాబు, గాసిరామ్‌దొరలు సీహెచ్‌సీకి వెళ్లి పరామర్శించారు.


బాధితులకు చికిత్స అందిస్తున్న సిబ్బంది

ఉత్తమ వ్యవసాయ విధానాలతో అధిక దిగుబడులు

అడ్డతీగల: ఉత్తమ వ్యవసాయ విధానాలను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పందిరిమామిడి కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు సూచించారు. మండలంలోని కోనలోవ,మిట్లపాలెం గ్రామాల్లో ఆయిల్‌పామ్,కర్ర పెండలంతో పాటు ఇతర తోటలను పందిరిమామిడి కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు టి.క్రాంతికుమార్ ,ఎస్.చిరంజీవి, పి.ప్రవీణ్‌బాబు మంగళవారం పరిశీలించారు. ఆయిల్‌పామ్‌లో జిగురు ఎర్రలు,వేపనూనె,పరాన్నజీవుల గుడ్లు ,ఐసీరియా జీవ సిలీంద్రం వాడకం వల్ల తెల్లదోమ ఉధృతిని అరికట్టవచ్చని శాస్త్రవేత్త ఎస్.చిరంజీవి తెలిపారు. కర్రపెండలం పి.డి.పి.సి. ఎం.ఆర్-1 రకం ప్రదర్శన క్షేత్రాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.కాయగూరల తోటలు పెంకం ద్వారా అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని మహిళలకు తెలిపారు.


ఆయిల్‌పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న శాస్త్రవేత్తలు

రవ్వలగూడ ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవో రాత్రి బస

అరకులోయ: మండలంలోని రవ్వలగూడ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ మంగళవారం రాత్రి బస చేశారు. ముందుగా పాఠశాల పరిసరాలు, గదులు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల భోజన అనంతరం వారు బస చేస్తున్న గదులకు పీవో వెళ్లి వారితో మాట్లాడి సదుపాయాలు, సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. గతంలో ఆయన ఉపాధ్యాయుడు కావడంతో విద్యార్థులకు పలు విద్యా అవసరమైన విషయాలు, కేరీర్ గైడ్‌లైన్స్‌ను వివరించారు. అనంతరం అక్కడ రాత్రి బస చేశారు.


విద్యార్థితో పాఠం చదివిస్తున్న ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

చేపల పెంపకంపై అవగాహన

రంపచోడవరం: వర్షాల సమయంలో చేపల పెంపకదారులు పలు జాగ్రత్తలు పాటించి, నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యశాఖ శాస్త్రవేత కె.వీరాంజనేయులు అన్నారు. మండలంలోని చేపల పెంపకందారులతో ఆయన మంగళవారం సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల వల్ల వాతావరణం చల్లబడినప్పుడు, చెరువుపై పొరల్లో నీరు వేగంగా బరువెక్కి అడుక్కి చేరుతుందన్నారు. చాలా రోజుల నుంచి అడుగున పేరుకుని ఉన్న కాలుష్యం కూడా చెదిరిపోయి చెరువు అంతా వ్యాపిస్తుందన్నారు. దీన్ని పాండ్ టర్న్ ఓవర్ అంటారని చెప్పారు. వర్షాల సమయంలో సూర్యకాంతి లభ్యత బాగా తగ్గిపోవడంతో వృక్షప్లవకాలు, ఫైటోప్లాంక్టాన్ ఉత్పత్తి చేసే ఆక్సిజన్ కూడా తగ్గిపోయి, వ్యాపించిన కాలుష్యం వల్ల చెరువులో ఆక్సిజన్ లోటు పెరుగుతుందన్నారు. వీటివల్ల చేపలు చనిపోతాయని చెప్పారు. ఏటా ఇటువంటి సమస్యల వల్ల చేపల పెంపకదారులకు విపరీతమైన ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. ఆయా పరిస్థితులోలపలు జాగ్రత్తలు తీసుకుంటే నష్టాలను అరికట్టవచ్చని సూచించారు. మేత కట్టడం, సేంద్రియ ఎరువులను వినియోగించొద్దన్నారు. తాజానీటితో చెరువు నీటిని మార్పిడి చేయాలని, చనిపోయిన వెంటనే చేపలను చెరువు నుంచి తొలగించాలన్నారు. నీటిని యాంత్రికంగా ఏరియేట్ చేయాలని, ఇందుకోసం పెడ్‌వీల్ ఏరియేటర్లు ఎక్కువగా సమర్థవంతమైనవి వినియోగించాలన్నారు. సందర్భాన్ని బట్టి కాల్షియం, పెరాక్సైడ్ ఎకరానికి 1 లేదా 2 కిలోలు లేక హైడ్రోజన్ పెరాక్సైడ్ ఎకరానికి ఒకటి లేకా రెండు లీటర్లు తాత్కాలిక ప్రయోజనం కోసం వినియోగించాలని సూచించారు. వృక్షప్లవకాలు చనిపోయిన చెరువులో మరలా ఎండలు కాస్తున్న సమయంలో సూపర్ ఫాస్ఫేట్ ఎకరానికి 25-30 కిలోలు వాడి మరలా వృద్ధి చేందేలా చేయాలని సూచించారు.


చేపల పెంపకందారులతో మాట్లాడుతున్న మత్స్యశాఖ శాస్త్రవేత్త వీరాంజనేయులు

మెరుగైన వైద్యం అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

పెదబయలు: గిరిజన గ్రామాల్లో గర్భిణులకు క్షేత్ర స్థాయిలోనే మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆమె మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. ప్రస్తుతం నమోదవుతున్న వ్యాధుల వివరాలను వైద్యాధికారి సింధురాణీని అడిగి తెలుసుకున్నారు. మందుల నిల్వపై ఆరా తీశారు. అనంతరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో అందుతున్న వైద్య సేవలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తం

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సుజాత మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో ఉండే వైద్య సిబ్బంది పనితీరు వల్లనే వ్యాధులను అదుపు చేయవచ్చన్నారు. ముఖ్యంగా శివారు గ్రామాల్లో గర్భిణుల ఆరోగ్యంపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రసవ తేదీకి ముందుగానే గర్భిణులను బర్త్ వెయిటింగ్ కేంద్రానికి తరలించాలని సూచించారు. గర్భిణుల తరలింపులో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఆశ వర్కర్లు వైద్యాధికారులను సంప్రదించి, సహాయం పొందాలన్నారు. శివారు గ్రామాల్లో ఉంటున్న గర్భిణులకు సైతం ఉత్తమ వైద్య సేవలందించాలని ఆదేశించారు. ఆస్పత్రిల్లో ప్రసవాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. డీటీహెచ్‌వో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు తదితరులున్నారు.


పెదబయలు పీహెచ్‌సీలో వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో సుజాత

చెన్నై బీచ్‌లో గల్లంతైన నాగేష్ మృతదేహం లభ్యం

రావికమతం: చెన్నై బీచ్‌లో గల్లంతైన చిలకవానిపాలెం గ్రామానికి చెందిన యాదగిరి నాగేష్ మృతదేహం మంగళవారం ఉదయం లభ్యమైంది. ఇక్కడి నుంచి 15 రోజుల క్రితం చెన్నై కూలి పనులకు వెళ్లిన నాగేష్ ఆదివారం సాయంత్రం బీచ్‌లో స్నానానికి దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. ఆ వార్త తెలుసుకుని నాగేష్ తల్లిదండ్రులు, బంధువులు సోమవారం రాత్రి చెన్నై బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం గల్లంతైన ప్రాంతం నుంచి కొద్ది దూరంలో నాగేష్ మృతదేహం లభ్యమైంది. అక్కడి పోలీసులు మృతదేహాన్ని గమనించి బంధువుల సమాచారంతో నాగేష్‌దిగా గుర్తించారు.


నాగేష్(ఫైల్)

కుటుంబాన్ని ఆదుకుంటానని వెళ్లి శవమయ్యాడు..: చెన్నై వెళ్తానని కష్టపడి పనిచేసి ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకుంటానని పలు మార్లు తల్లిదండ్రులైన సత్తిబాబు, వరహాలమ్మకు తెలిపాడు. అయినా వారు ఎన్నోసార్లు వద్దని వారించారు. అయితే 15 రోజుల క్రితం ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు, పెద్దలు పనులకు చెన్నై వెళ్తుండడంతో వారితో నాగేష్ కూడా వెళ్లాడు. అతను అక్కడ సముద్రంలో గల్లంతయ్యాడని ఇక్కడికి సమాచారం అందినప్పటి నుంచి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబాన్ని ఆదుకుంటానని శవమయ్యావా అంటూ రోదించారు.

కొడుకుపై మక్కువతో దత్తత తీసుకుని..: సత్తిబాబు, వరహాలమ్మకు ఒక కుమార్తె కాగా, గతేడాది ఆమెకు వివాహం చేశారు. అయితే కొడుకుపై మక్కువతో ఏడాది బిడ్డగా ఉన్న నాగేష్‌ను పాతికేళ్ల క్రితం దత్తత తీసుకున్నారు. అమితమైన ప్రేమతో పెంచి పెద్ద చేశారు. మృత్యువు పగబట్టి ఈ విధంగా నాగేష్‌ను తీసుకుపోవడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. నాగేష్ మృతదేహానికి పోస్టుమార్టం చేసి మంగళవారం అప్పగించారని, కుటుంబీకులు అక్కడే అంత్యక్రియలకు ఏర్పాటు చేశారని వారి బంధువులు తెలిపారు.

37.5 ఎకరాల ఫారెస్టు భూమి స్వాధీనం


ఆక్రమణ భూమిలో బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు

మాకవరపాలెం: ఆక్రమణలో ఉన్న 37.5 ఎకరాల భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూమి అటవీశాఖదంటూ మంగళవారం అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. పోలీసు, అటవీ సిబ్బంది బందోబస్తు నడుమ ఈ భూమిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. విశాఖ అటవీ డివిజన్ పరిధిలోని తీడ రిజర్వు ఫారెస్టులో ఉన్న 37.5 ఎకరాల భూమిని ముగ్గురు వ్యక్తులు ఆక్రమించి రేకుల షెడ్డు వేసుకుని జీడి, మామిడి పంట సాగు చేస్తున్నట్టు రేంజర్ రామనరేష్ తెలిపారు. ఈ భూమి ఫారెస్టుకు చెందినదని కేసులు పెట్టడంతోపాటు ఈ భూమిని ఖాళీ చేయాలని పలుమార్లు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చామన్నారు. ఆక్రమణదారులు కోర్టుకు వెళ్లడంతో కేసు కొట్టివేసిందని, నిబంధనల మేరకు నడుచుకోవాలని తమకు సూచించిందన్నారు. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం మళ్లీ నోటీసులు ఇచ్చామని, ఆక్రమణదారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో సబ్ డీఎఫ్‌వో ధర్మరక్షిత్, మాకవరపాలెం తహసీల్దార్ ప్రసాదరావు, ఎస్ఐ రామకృష్ణారావు సమక్షంలో స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ భూమిని గండిపేట వి.ఎ స్.ఎస్ సభ్యులకు అప్పగిస్తున్నామన్నారు. ఈ భూమిలో ఉన్న అన్ని రకాల చెట్లపై నంబర్లు వేశారు. ఇకపై ఈ భూమిని ఎవరు ఆక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మండల సమావేశం

గూడెంకొత్తవీధి : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు,అధికారులు హాజరు కావాలని కోరారు.

అరకులోయ: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు ఎంపీపీ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని కార్యాలయ సూపరింటెండెంట్ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు మురళి

చింతూరు: స్థానిక గురుకుల పాఠశాలను ఎస్టీ కమిషన్ సభ్యుడు చిచ్చడి మురళీ స్థానిక నాయకులతో కలిసి మంగళవారం సందర్శించారు. భోజన, వసతి సదుపాయాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన విద్య , నాణ్యమైన ఆహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వైస్ ఎంపీపీ అర్జున్, సర్పంచ్‌లు కన్నారావు, సత్తిబాబు, చంద్రయ్య, ఉప సర్పంచ్‌లు బాబూరావు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పోతుకొండలో తోటబడి కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, ఉద్యానశాఖ సిబ్బంది

దేవీపట్నం: జీడిమామిడి సాగులో తగిన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని రంపచోడవరం ఉద్యానశాఖాధికారి ఎన్.రమేష్ తెలిపారు. ఇందుకూరుపేట పంచాయతీ పోతుకొండ గ్రామంలో మంగళవారం ఉదయం తోటబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులకు తగిన సలహాలు, సూచనలు అందించారు. జీడిమామిడి చెట్లకు గల ఎండు కొమ్మలు, పుచ్చుపట్టిన కొమ్మలను తొలగించి బోర్డో మిశ్రమం పూయాలని, చెట్టు చుట్టూ పాదులు ఏర్పాటు చేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని సూచించారు. రైతులు, వ్యవసాయ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం బహిష్కరణ

పెదబయలు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరగల్సి ఉండగా ఎంపీటీసీ సభ్యులంతా సభను బహిష్కరించారు. గత మూడు సర్వసభ్య సమావేశాలు జరిగిన పలు సమస్యలపై తీర్మానాలు చేసి నేటికి ఒక సమస్య కూడా పరిష్కారం కాక పోవడం, తదితర కారణాల వల్ల 15 మంది సభ్యులకు 8 మంది సమావేశాన్ని బహిష్కరించారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది.

క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను పర్యవేక్షిస్తున్న మండల అకడమిక్ అధికారి సత్యనారాయణ, ఉపాధ్యాయులు

గంగవరం : రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే ఆదేశాల మేరకు మండలంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. స్థానిక బాలికల పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలతో పాటు క్విజ్, వ్యాసరచన, పలు సాంస్కృతిక పో టీలు నిర్వహించారు. మండల అకడమిక్ అధికారి ఆర్.వి.వి. సత్యనారాయణ, హెచ్‌ఎం ఝాన్సీ హేన్సన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తులో వాహనం నడిపితే చర్యలు



బ్రీత్ ఎనలైజింగ్ టెస్ట్ నిర్వహిస్తున్న పోలీసులు

చింతూరు: చట్టి జంక్షన్ వద్ద సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ యాదగిరితో కలిసి మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇద్దరిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. సీఐ అప్పలనాయుడు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి



గడుగుపల్లిలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ

చింతపల్లి: గడప గడపకు కార్యక్రమంలో భాగంగా గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రూ.20 లక్షల చొప్పున మంజూరు చేసిందన్నారు. ఆయా నిధులతో ప్రాధాన్యత సమస్యలు గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమస్యలు గుర్తించి తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రతి పక్షాల ఆరోపణలను ఖండించాలని ఆమె తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే నాయకులను పక్కన పెడతామని ఆమె హెచ్చరించారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత, జీకేవీధి ఎంపీపీ కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు రవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జల్లి హలియారాణి, అరుకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపతో సమస్యల పరిష్కారం

హుకుంపేట: పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ఇందుకోసం అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడిపుట్టు పంచాయతీ కేంద్రంతో పాటు గడుగుపల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో 185 గడపలను ఆయన సందర్శించారు. సంక్షేమ పథకాలు అమలు. గ్రామాల్లో సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి చెట్టి వినయ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొండలరావు, ఎంపీటీసీ సభ్యులు సింహాచలం, నాగరాజు, సర్పంచ్‌లు వెంకట పూర్ణిమ, సాంబ, మండల పార్టీ అధ్యక్షుడు కొండబాబు, సొసైటీ బ్యాంకు చైర్మన్ రామకృష్ణ, ఏపీఎం కృష్ణారావు,ఏవో సరోజిని,ఎంపిటీసీలు కిలగడ సింహచలం,నాగరాజు, నాయకులు చినసత్యం, బొంజుబాబు, శామ్యూల్, మత్స్యరాజు, అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం తగదు



దుంబ్రిగులో అంగన్‌వాడీ కార్యకర్తలకు స్మార్ట్‌ఫోన్లు అందజేస్తున్న సీడీపీవో నీలిమ



గంగవరంలో ర్యాలీలో జెడ్పీటీసీ సభ్యురాలు, ఐసీడీఎస్, అంగన్‌వాడీ సిబ్బంది

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో నీలిమ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన స్మార్ట్‌ఫోన్‌లను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సదుపాయాలను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల వ్యాప్తంగా 18 పంచాయతీల్లో ఉన్న 161 మెయిన్, మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ పోషణ కార్యక్రమం అమలుపై రోజువారీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఇటీవల ప్రకటించిన వయ్యా, బలకట్టు, అరకు సంతబయలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులకు 17 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి 16న దుంబ్రిగుడ ఐసీడీఎస్ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందన్నారు. అనంతరం 19న పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

ఘనంగా పౌష్టికాహార మాసోత్సవం

గంగవరం : స్థానిక సీడీపీవో కార్యాలయంలో మంగళవారం సీడీపీవో లక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు దేవీరత్నం, వైస్ ఎంపీపీ కె.గంగాదేవీలు హాజరయ్యారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వివరించారు. అనంతరం పౌష్టికాహార మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఏపీఎంగా శ్రీనివాసరావు



కొయ్యూరు: కొయ్యూరు ఏపీఎంగా కె.శ్రీనివాసరావును నియమించారు. ఆయన అనకాపల్లి జిల్లా యలమంచిలి నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏపీఎంగా పని చేసిన రాజుబాబును అనకాపల్లి జిల్లాకు బదిలీ చేశారు. రాజు బాబుతో కలిసి ఏపీఎం శ్రీనివాసరావు కార్యాలయానికి వచ్చి, ఇక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరిస్తామన్నారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు



అమ్మిరేఖల గ్రామంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శ్రీదుర్గ, సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని లోతట్టు గ్రామాలైన అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ, కొత్తవీధి ప్రాంతాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించినట్టు రాజవొమ్మంగి పీహెచ్‌సీ డాక్టర్ శ్రీదుర్గ తెలిపారు. శిబిరాల్లో 70 మందిని పరీక్షించగా 15 మంది జ్వరంతో బాధపడుతున్నారని, రక్తపూతలు సేకరించామని, ఫలితాల అనంతరం పూర్తి చికిత్స అందజేస్తామన్నారు. పద్మావతి, సుధాకర్, రమాభాయి, మహేశ్వరి, బాలమ్మ, సత్యవతి, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



ఏపీడీ శ్రీనివాస్

రాజవొమ్మంగి: ఆసిల్ కోళ్ల పెంపకం ద్వారా ఎస్‌హెచ్‌జీ మహిళలు అదనపు ఆదయం సముపార్జించవచ్చని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీడీ శ్రీనివాస్ అన్నారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. డివిజన్‌లోని అన్ని మండలాలోని ఆసక్తి గల చిన్న సంఘాలకు (ఎస్‌హెచ్‌జీలకు) బుధవారం ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ఆసిల్ కోళ్ల యూనిట్లను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. రంపచోడవరం డివిజన్‌లో మొత్తం 1200 యూనిట్లు పంపిణీ చేస్తుండగా, రాజవొమ్మంగి మండలానికి 200 యూనిట్లను కేటాయించినట్టు చెప్పారు. ఒక్కో యూనిట్ ఖరీదు రూ.4800లుగా పేర్కొన్నారు. ఒక్కో యూనిట్‌లో రెండు పుంజులు, పది పెట్టలు ఉంటాయన్నారు. ఈ కోళ్లు సంవత్సరంలో 150 నుంచి 200 గుడు పెడతాయన్నారు. డ్వాక్రా సంఘ మహిళలు మహిళలు స్వయం ఉపాధి పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. డ్వాక్రా సంఘ సభ్యుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం సరఫరా చేస్తున్న కోళ్ల పెంపకంతో స్వయం ఉపాధి పొందవచ్చన్నారు.

పాఠశాల కోసం వినతి



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులతో ఎంపీటీసీ అప్పారావు

కొయ్యూరు: గదబపాలెం పంచాయతీ కొత్తూరులో పాఠశాలను ఏర్పాటు చేయాలని డౌనూరు ఎంపీటీసీ బిడిజన అప్పారావు మంగళవారం ఐటీడీఏ పీవో గోపాలకృష్ణను ఫోన్‌లో కోరారు. 25 మందికి పైగా పిల్లలున్న గ్రామానికి పాఠశాల లేకపోవడంతో రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న గదబపాలెం వెళ్తున్నారని, ఈ క్రమంలో మధ్యలో గెడ్డ దాటాల్సి వస్తోందని, ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అనంతరం అప్పారావు విలేకరులతో మాట్లాడుతూ అరకు ఎంపీ మాధవి, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. అక్కడ పాఠశాల ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాలువ ఉధృతంగా ప్రవహిస్తే రెండు మూడు రోజుల వరకు పాఠశాలకు రాలేని పరిస్థితి నెలకొందని ఆయన వివరించారు.

ఇసుక అక్రమ లావాదేవీలు చేస్తే చర్యలు

సాక్షి,పాడేరు: ఇసుక సబ్ కాంట్రాక్టుల పేరుతో జిల్లాలో ఇసుక విక్రయాలు నిర్వహిస్తున్నామని లావాదేవీలు జరిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పాడేరు సీఐ సుధాకర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలకు మెస్సర్స్ జయప్రకాశ్ పవర్ వెంచర్స్ లిమిటెడ్(జేపీవీఎల్) టెండర్ల ద్వారా అనుమతి పొందిందని పేర్కొన్నారు. ఆ సంస్థ అనుమతించిన వారికి మాత్రమే ఇసుక విక్రయాలకు అనుమతి ఉందన్నారు. ఇతరులు ఎవరైనా తాము సబ్ కాంట్రాక్టులు పొందినట్టు లావాదేవీలు జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సబ్ కాంట్రాక్ట్‌లు పొంది జిల్లాల వారీగా విక్రయాలు నిర్వహిస్తున్నట్టు వార్తలను జేపీవీఎల్ సంస్థ ఖండించిందని, అలా ఎవరైనా ప్రచారం చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా చేపడుతున్న ఎవెన్యూ ప్లాంటేషన్ (నీడనిచ్చు చెట్ల పెంపకం) పనులను ఉపాధి హామీ పథకం ప్రోగ్రాం ఆఫీసర్, ఎంపీడీవో కె.బాపన్నదొర మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తంటికొండ పంచాయతీ సింగంపల్లి గ్రామానికి సంబంధించి మూడు కిలోమీటర్ల మేర దాదాపు రూ. 3.99 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపడుతున్నట్టు తెలిపారు. వట్టిగెడ్డ దుర్గమ్మ గుడి నుంచి సింగంపల్లి వరకు సుమారు 1200 మొక్కలు నాటి, చుట్టూ ట్రీగార్డ్స్ ఏర్పాటుచేయనున్నట్టు చెప్పారు. ఇప్పటికే రోడ్డుకు ఇరువైపులా తుప్పల తొలగింపు పనులు పూర్తయినట్టు తెలిపారు. టెక్నికల్ అసిస్టెంట్ కె.మంగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ తులసి, సీనియర్ మేట్లు, ఉపాధి వేతనదారులు పాల్గొన్నారు.

డౌనూరులో పారిశుధ్య పనులు

కొయ్యూరు: డౌనూరులో పారిశుధ్య పనులు చేయించినట్టు సర్పంచ్ భవానీ చెప్పారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించి, చెత్త తొలగింపు పనులు చేయించి, పారిశుధ్యంపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సింహాచలం పనులు పర్యవేక్షించారు.

నేడు పశువైద్య శిబిరం

దుంబ్రిగుడ: పోతంగి పంచాయతీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో తోటవలస, బోడుగూడ, బిల్లాపుట్టు, చెలిమరవలసతో పాటు 25 గ్రామాల్లో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు వెటర్నరీ అసిస్టెంట్ జన్ని రాజు మంగళవారం తెలిపారు. పాడి రైతులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భాషా వలంటీర్లను రెన్యువల్ చేయాలి

అరకులోయ : స్థానిక గిరిజన సంఘం భవనంలో అనంతగిరి, అరకులోయ, దుంబ్రిగుడ మండలాలకు చెందిన గిరిజన సంఘం నేతలతో, మాతృ భాష వలంటీర్లు మంగళవారం సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు తదితరులు మాట్లాడుతూ మాతృభాష వలంటీర్లను రెన్యువల్ చేసి భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్, ఐటీడీఏ పీవోలు మాతృభాష వలంటీర్లను యదావిధిగా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నాయకులు కుమారి, నాగేంద్ర, కృష్ణ, ప్రకాష్‌రాజ్, నాగేశ్వరరావు, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

ఎటపాక: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం15న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విఠల్‌పాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కాక కామేశ్వరి అధ్యక్షతన జరిగే సమావేశానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ నివేదికలతో హాజరుకావాలని కోరారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం జరుగుతుందని చెప్పారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

మారేడుమిల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చింతూరుకు చెందిన ఎం.రజాక్ చింతూరు నుంచి రాజమహేంద్రవరం బైకుపై మంగళవారం వెళ్తుండగా సున్నంపాడు గ్రామ సమీపం వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో అతనికి కాలు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు ఆటోలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తాగునీటి పథకం పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న మండల సర్పంచ్‌లో ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ

జి.మాడుగుల: పాలమామిడి పంచాయతీ వనభంగిపాడు గ్రామంలో మంగళవారం జల్‌జీవన్ మిషన్ కింద మంజూరైన తాగునీటి పథకం నిర్మాణ పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రామకృష్ణ మంగళవారమ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించనున్నట్టు తెలిపారు. పథకానికి రూ.5లక్షలు నిధులు మంజూరైనట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు గణపతి, ఈశ్వరరావు, రామస్వామి, రామ్మూర్తి, రాంబాబు,సత్తిబాబు, కాసులమ్మ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



బాధిత కుటుంబానికి నగదు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కుమారి, నేతలు

గూడెంకొత్తవీధి : గత ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు మండలంలోని అరటితోముల గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఇంటిగోడ కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రామానికి చెందిన గుంట కందరి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గోడ బయటవైపు కూలింది. దీంతో కందరి, కూతురు కాసులమ్మ, కుమారుడు శోభన్‌లు ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీపీ బోయిన కుమారి మంగళవారం ఉదయం గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం నిత్యావసర సరకులు, కొంత నగదు సాయాన్ని అందజేశారు. సర్పంచులు సుభద్ర, రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు నాగమణి, రాజులమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు దావూద్, వీఆర్‌వో రామారావు, వైఎస్సార్ సీపీ నేతలు అరుణ్, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



జీకే వీధిలోని ఆర్‌బీకేలో రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ కుమారి, నేతలు



దాలిగుమ్మడిలో రైతులకు రాజ్‌మా విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ పూర్ణిమ, ఏవో సరోజిని



కొత్తపాలెంలో రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ బాలయ్య, సర్పంచ్ సోమరత్నం

గూడెంకొత్తవీధి : మండల కేంద్రంలోని ఆర్‌బీకేలో ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలను ఎంపీపీ బోయిన కుమారి మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, అనేక సంక్షేమ పథకాలు అమలుచేస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఐ అప్పలసూరి, సర్పంచులు సుభద్ర, రామకృష్ణ, ఎంపీటీసీలు నాగమణి, కాసులమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు పాల్గొన్నారు.

హుకుంపేట: దాలిగుమ్మడి, బాకురు ఆర్‌బీకేల్లో రాజ్‌మా విత్తనాలను సర్పంచ్‌లు వెంకటపూర్ణిమ, వెంకటరమణ, పద్మకుమారి తదితరులు రైతులకు అందజేశారు. ఏవో సరోజిని, నాయకుడు అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి రూరల్: కొత్తపాలెం పంచాయతీలో రైతులకు రాజ్‌మా విత్తనాలను జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, సర్పంచ్ సోమరత్నం పంపిణీ చేశారు. అనంతరం మామిడిపల్లి గ్రామంలో జరిగిన మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు. డాక్టర్ సావిత్రి గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు కార్డుతో ఆధార్ లింక్‌కు సహకరించాలి

రాజవొమ్మంగి: ప్రతి పోలింగ్ బూత్ పరిధిలో జరుగుతున్న ఓటు కార్డు– ఆధార్ కార్డు అనుసంధానం ప్రక్రియకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి కోరారు. అక్టోబర్ రెండో శనివారం నాడు ఓటరు కార్డు ఆధార్ లింకప్ డ్రైవ్‌ను ప్రతి బూత్‌లో నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఓటరు లిస్టు ప్యూరిఫికేషన్ (ఓటర్ల శుద్ధి) ప్రక్రియలో భాగంగా (1-1-2023) నాటికి కొత్త ఓటు నమోదు, సవరణలు, ఓటరు లిస్టు నుంచి మృతుల తొలగింపు వంటివి పూర్తి చేయాలన్నది లక్ష్యమన్నారు. ప్రతి ఓటరు తమ ఆధార్ కార్డును సమీపంలోని బూత్ లెవల్ ఆఫీసర్‌కు ఇచ్చి ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని కోరారు. మండలంలో 31వేల మంది ఓటర్లు ఉండగా ఆధార్–ఓటు అనుసంధానం 14వేల ఓటర్లకు పూర్తయినట్టు తెలిపారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈఓ మల్లేశ్వరరావు

దేవీపట్నం: ఇందుకూరుపేట ఎంఆర్‌సీ కార్యాలయంలో మంగళవారం జరిగిన మధ్యాహ్న భోజన నిర్వాహకుల శిక్షణ కార్యక్రమంలో ఎంఈవో మల్లేశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని అన్ని పాఠశాలల్లో సక్రమంగా అమలు చేయాలన్నారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంట చేసినపుడు, వడ్డించినపుడు తప్పనిసరిగా చేతికి గ్లౌజులు, క్యాప్ ధరించాలని సూచించారు. వంట చేసే పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. సామగ్రి పరిశుభ్ర ప్రదేశంలో భద్రపరచాలన్నారు. పాఠశాలల్లో టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

తెగుళ్ల నివారణకు సూచనలు



పలు పత్ర కషాయం తయారీ విధానాన్ని రైతులకు వివరిస్తున్న కో–ఆర్డినేటర్లు

రాజవొమ్మంగి: పత్తి పంటపై రసం పీల్చు పురుగు నివారణకు పలుపత్ర కషాయం ఎంతో మేలుగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయం ఎన్‌సీఆర్పీ అప్పలరాజు, ఎస్‌డీఏ శ్రీనివాస్, జీవీకే మండల కోఆర్డినేటర్ తెడ్ల అబ్బాయి అన్నారు. మండలంలోని ఉర్లాకులపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పత్తి పంట సాగుచేస్తున్న రైతులకు వారు వివిధ పంటలపై ఈ సీజన్‌లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. ఇందులో భాగంగా రసం పీల్చు పురుగు నివారణకు పలుపత్ర కషాయం తయారుచేసి, పంటపై పిచికారీ విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కషాయం తయారీకి కసివింద పత్రాలు 2కిలోలు, సీతాఫలం ఆకులు 3కిలోలు, వేప ఆకులు 2కిలోలు, 100 గ్రాముల వెల్లుల్లి, 10 గ్రాముల సొంటి కలిపి ఒక బాణలిలో 10 లీటర్లు నీరు పోసి బాగా ఉడకబెట్టాలన్నారు. ఈ కషాయం 5 లీటర్లు వచ్చే వరకు మరగబెట్టాలన్నారు. అనంతరం ఆ కషాయానికి వంద లీటర్ల నీటిని కలిపి ఎకరం పంటపై మొక్కలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. జీవీకే (గ్రామీణ వికాశ కేంద్రం) ఏపీ. సీఎన్‌ఎఫ్ (కమ్యూనిటి నేషనల్ ఫార్మింగ్) సంయుక్తంగా ప్రకృతి విధానంలో పత్తి, వరి పంటలను ప్రోత్సహిస్తున్నట్లు వారు తెలిపారు. మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పత్తి 300 ఎకరాల్లో, వరి వంద, కూరగాయాలు మరో పది ఎకరాల్లో సాగవుతున్నట్టు తెలిపారు. ఐసీఆర్పీ సీత, నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.